పొంచి ఉన్న ప్రమాదం..

– కంచె ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కంచెలేకుండా ఎత్తు తక్కువగా ఉంది. ప్రమాదకరంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని, స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ.. కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పంటల మార్పిడితోనే అధిక దిగుబడులు

శామీర్‌పేట్: పంటల మార్పిడితో అధిక దిగుబడులు పొందవచ్చని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ అనురాధా, లక్ష్మీప్రసన్నలు తెలిపారు. సోమవారం మూడుచింతలపల్లి మండలం, కేశ్వాపూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయంలో మెలకువలపై అవగాహన కల్పించారు. మోతాదుకు మించి యూరియా వాడకూడదని, సాగుఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. అవసరమైన మేరకే రసాయనాలను వాడి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. విత్తన రశీదులు భద్రపరుచుకోవాలని, కష్టకాలంలో పంట నష్టపరిహారాన్ని పొందాలన్నారు. ఏఈఓ లక్ష్మణ్‌గౌడ్, విద్యార్థులు రోహిత, శిరిష, రైతు సమితి అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వీటీఏ మాధవీలత, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

జనుము, జీలుగ విత్తనాల పంపిణీ

కీసర: కీసర మండల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం వద్ద 50 శాతం సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, మండల వ్యవసాయశాఖ అధికారిణి మాధవీలత ఓ ప్రకటనలో తెలిపారు. జనుము 40 కిలోల బస్తాకు రూ.2510, జీలుగ 30 కిలోల బస్తాకు రూ.2137లకు అందుబాటులో ఉన్నాయని, ఈ విత్తనాలు పొందడానికి తమ పట్టాపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్లతో రావాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బెల్లి లలితకు ఘన నివాళి

జవహర్‌నగర్: తెలంగాణ మలిదశ ఉద్యమకారిణి బెల్లి లలితాయాదవ్ అని జవహర్‌నగర్ మాజీ కార్పొరేటర్ మేక లలితాయాదవ్ అన్నారు. భువనగిరిలోని అమరవీరుల స్థూపం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెల్లి లలితయాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కొనపూరి కవిత, రాజారాంయాదవ్, సురేష్‌యాదవ్, వెన్నెల, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు ఇంకేదెలా..?



మల్లికార్జుననగర్‌లో శిథిలావస్థలో ఇంకుడు గుంత

నగరంలో కాంక్రీట్ నిర్మాణాల కారణంగా భూమిపై నీటి నిల్వలు ఏ స్థాయిలోకి పడిపోతాయోనని ఊహించుకుంటేనే ఆందోళన కలుగుతోంది. భూగర్భజలాలు సంరక్షించే బాధ్యత ప్రజలందరిపై ఉందని, కొత్త ఇంకుడు గుంతల ఏర్పాటుతో పాటు పాత వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – గౌతంనగర్

- చెత్త, చెదారంతో నిండిపోయిన వైనం
- భూగర్భజలాలకు సంరక్షణకు ఆటంకం

మట్టి పేరుకుపోయి..

వర్షపునీరు డ్రైనేజీ పాలవకుండా భూమిలోకి ఇంకించేందుకు ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల నిర్వహణ లోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి. మట్టి పేరుకుపోయి నిరుపయోగంగా ఉన్నాయి. డివిజన్ పరిధిలోని లక్షలాది గృహ సముదాయాలు ఉండగా.. కేవలం 30 నుంచి 40 మాత్రమే ఇంకుడు గుంతలు ఉన్నాయి. పలు కాలనీల్లో బహిరంగ ప్రదేశాల్లో ప్ర భుత్వం తరఫున నిర్మించిన ఇంకుడు గుంతుల నిర్వాహణ లేమితో శిథిలావస్థకు చేరుకున్నాయి. సుమారు 9 నుంచి 10 ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలలో దయానంద్‌నగర్, మల్లికార్జుననగర్, గౌతంనగర్, గోపాల్‌నగర్, మిర్జాల్‌గూడ ప్రాంతాలు ఉన్నాయి.

శిథిలావస్థకు చేరిన ఇంకుడు గుంతలు..

భూగర్భ జలాలను పరిరక్షించడానికి గతంలో జలమండలి అధికారులు గౌతంనగర్ డివిజన్ పరిధిలోని గోపాల్‌నగర్, మల్లికార్జుననగర్, ఉత్తంనగర్, దయానంద్‌నగర్, మిర్జాల్‌గూడ తదితర ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పలుచోట్ల ఇంకుడు గుంతలు చెత్త, చెదారంతో పాటు పిచ్చిమొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇలా మారాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

పడిపోయిన భూగర్భజలాలు..

సర్కిల్ పరిధిలోని కొత్తగా బోరు వేయాలంటే కనీసం 1200 అంగులాలపైన వేయాల్సి వస్తుంది. అయినా నీరు పడుతుందో లేదో.. ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. భూగర్భ జలాలు పెరగాలంటే ఎవరో ఒకరిద్దరు ఇంకుడు గంతలు ఏర్పాటు చేసుకుంటే సరిపోతుంది.. అన్నట్లు కాకుండా ప్రజాప్రతిధులు, అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా అడుగులు వేయాలి.

అటకెక్కిన ప్రోత్సాహకాలు..

గతంలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు సంబంధించి సర్కిల్ అధికారులు దరఖాస్తులు ఆహ్వానించేవారు. కాలనీలు, రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే 70 శాతం నిధులు మంజూరు చేసేవారు. సొంతింట్లో ఏర్పాటు చేసుకుంటే సుమారు 50 శాతం ఖర్చును జీహెచ్ఎంసీ భరించేది. ప్రస్తుతం ఈ పథకాన్ని అటకెక్కించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిర్వహణపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి



శిథిలావస్థకు చేరిపోయి ఉన్న ఇంకుడు గుంతలకు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకురావాలి. వచ్చేది వర్షాకాలం కాబట్టి ఇంకుడు గుంతలను ఉపయోగంలోకి తీసుకొస్తే భూగర్భజలాలను పెంచడానికి వీలుంటుంది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని ఇంకుడు గుంతల నిర్వాహణ మెరుగుపరచాలి.

– శ్రీనివాసన్, మల్లికార్జుననగర్

మరమ్మతులు చేపడతాం

బహిరంగ ప్రదేశాల్లోని ఇంకుడు గుంతల మరమ్మతులకు అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యమిస్తూ.. ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ప్రయత్నిస్తాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి శిథిలావస్థకు చేరుకున్న ఇంకుడు గుంతలను వినియోగంలోకి తీసుకొస్తాం.

– నవీన్, జలమండలి అధికారి, గౌతంనగర్

సర్వేయర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలి

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట్: మేడ్చల్‌జిల్లా, శామీర్‌పేటలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న కొత్తగా నియమితులైన 146 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, శిక్షణ కార్యక్రమానికి సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేయర్లు తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకుని, నేటి నుంచి ప్రారంభంకాకున్న శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. శిక్షణా కార్యక్రమం 52 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ పొందిన తర్వాత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల ని తెలిపారు. శామీర్‌పేట్ మండలం తహసీల్దా ర్ యాదగిరిరెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, పలువురు సంబంధితశాఖ అధికారులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి



జవహర్‌నగర్‌లో నిరసన చేస్తున్న ప్రజా సంఘాలు


జవహర్‌నగర్: మానవీయత పాటించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. చత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోల మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించకపోవడాన్ని నిరసిస్తూ.. పీవోడబ్ల్యూ (విముక్తి) పెర్క సునీత ఆధ్వర్యంలో ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల సమక్షంలో సోమవారం జవహర్‌నగర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాల సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేసి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలన్నారు. వెంటనే వారి మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించాలన్నారు. ఇఫ్టూ జాతీయ కన్వీనర్ షేక్‌షావలి, ఎస్‌కె.మీరా, యాదగిరి, శివనారాయణ, యాకస్వామి, సావిత్రి, పాషామియా, సింగరయ్యగౌడ్, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం

– ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని బాలకృష్ణానగర్‌లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యతో పాటు అంతర్గత రోడ్లు లేవని, దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. బాలకృష్ణనగర్‌లో మంజూరైన అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని జలమండలి జీఎం సంతోష, ఇతర అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు తావులేకుండా పరిష్కరిస్తున్నానని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, అభివృద్ధి పనులు కొనసాగుతున్నప్పుడు స్థానిక సంక్షేమ సంఘాల నేతలు పర్యవేక్షించాలని సూచించారు. గంధం నాగేశ్వర్‌రావు, నరసింహారెడ్డి, జహంగీర్, మహేశ్వర్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, రాములు, సోమయ్య రమేష్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కేబుల్ వైర్లు



విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న ఇంటర్నెట్ కేబుళ్లు

రామంతాపూర్ : పరిధిలోని రామంతాపూర్, హబ్సిగూడ డివిజన్‌లో వివిధ కాలనీలు, బస్తీల్లో సిమెంట్, ఇనుముతో తయారు చేసిన విద్యుత్ స్తంభాలకు పిచ్చుక గూళ్ల స్తంభం కనబడటనంత రీతిగా కేబుల్ వైర్లు చుట్టుకుని ఉన్నాయి. ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల ఇంటర్నెట్ కేబుల్‌వైర్లు కుప్పలు తెప్పలుగా స్తంభాలకు చుట్టుకుని ఉండటంతో గాలివర్షాలకు కూలిపోయే ప్రమాదం ఉందని ఎప్పుడూ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు ఇంటర్నెట్ కేబుల్ వైర్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. రామంతాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ దృష్టికి తీసుకెళ్లడానికి ఫోన్ నెం. 9440813177.

ఆస్తిపన్ను వసూళ్లలోమార్పు!

- పురపాలికల్లో నూతన నిబంధనలు
- నగదు లావాదేవీల్లో అవుట్‌సోర్సింగ్‌ల తొలగింపు
- 29 పురపాలికల్లో రెగ్యులర్ ఉద్యోగులకు బాధ్యతలు



సాక్షి,సిటీబ్యూరో: పురపాలికల్లో ఆస్తిపన్ను వసూళ్ల విధానంలో ప్రభుత్వం మార్పులు చేసింది. నగదు లావాదేవీల నిర్వహణ నుంచి అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని తప్పించి, వార్డు ఆఫీసర్లకు అప్పగించారు. సరిపడాలేని పురపాలికల్లో సీనియర్, లేదా జూనియర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పజెప్పారు. ఆస్తిపన్నుల వసూళ్లలో నూతన నిబంధనలు అమలు చేయటంతో నగదు లావాదేవీల్లో అవకతవకలను పూర్తిగా నియంత్రించవచ్చని, పుర యంత్రాంగం భావిస్తోంది. రాష్ట్రంలోని పలు పురపాలిక (పట్టణాలు)ల్లో ఆస్తిపన్ను వసూళ్లలో అవకతవకలు జరిగినట్లు గుర్తించింది. దీన్ని అరికట్టేందుకు తాజాగా ఆస్తిపన్నుల వసూళ్లలో నూతన నిబంధనలను రూపొందించి అన్ని పురపాలికల్లో అమలుచేస్తోంది.

జమ చేయడం లేదని..

మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలోని పలు పురపాలికల్లో సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆస్తిపన్నులు వసూలు చేస్తున్నారు. పురపాలక సంఘం కార్యాలయంలోని సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో ఆస్తి పన్ను చెల్లించిన వారికి కంప్యూటరైజ్డ్ రశీదు అందజేస్తున్నారు. అయితే.. పలు పురపాలికల్లో ఆస్తిపన్నుల లావాదేవీల విధులు నిర్వహించే అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వసూలైన ఆస్తిపన్ను డబ్బులను సకాలంలో క్యాష్‌కౌంటర్‌లో జమచేయడం లేదన్న ఫిర్యాదులు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. దీంతో రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాలను జారీ చేసింది.

ఉద్యోగులకే బాధ్యతలు

పురపాలికల్లో ఏటా ఆస్తిపన్ను వసూళ్లను సిబ్బంది చేతి యంత్రాల్లో (హ్యాండ్ హెల్డ్ మెషిన్) పీటీఐఎన్ (ప్రాపర్టీ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నెంబర్) నమోదు చేసి ఎంతమేర పన్ను ఉందో చెప్పి, డబ్బులు వసూలు చేసి రశీదును అందజేస్తారు. సేకరించిన డబ్బులను పురపాలికల్లోని క్యాష్ కౌంటర్‌లో జమచేస్తారు. పన్నువసూళ్లకు చాలాచోట్ల అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు.

రెగ్యులర్ ఉద్యోగుల పేరిటే యంత్రాలు

వాస్తవానికి చేతి యంత్రాలు (మిషన్లు) రెగ్యులర్ ఉద్యోగుల పేరిటే ఉన్నా.. ఉద్యోగుల కొరత కారణంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఆస్తిపన్ను వసూళ్లకు సంబంధించిన విధులు చేపడుతున్నారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది అవకతవకలకు పాల్పడితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం లేదు. దీంతో వారిని పన్ను వసూళ్ల నుంచి తప్పించి రెగ్యులర్ ఉద్యోగులనే నగదు లావాదేవీలు నిర్వహించేలా బాధ్యతలు అప్పగించాలని పురపాలకశాఖ ఉన్నతాధికారులు సూచించారు. మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలికల్లో రెగ్యులర్ ఉద్యోగుల కొరత ఉన్న చోట.. సీనియర్ లేదా జూనియర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించారు.

పకడ్బందీగా అమలు...

పురపాలికల్లో ఆస్తిపన్ను వసూళ్లలో రాష్ట్ర మున్సిపల్ శాఖ సూచించిన నిబంధనలను ఆయా పురపాలక సంఘాల కమిషనర్లు అమలు చేస్తున్నారు. రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లలో అవకతవకలు జరిగిన కారణంగా పురపాలకశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే పురపాలక అధికార యంత్రాంగం అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో నగదు లావాదేవీల నిర్వహణ విధులకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకుంటోంది.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: సమస్యలు పరిష్కరించాలని బల్దియా కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధిదీపాల నిర్వహణ అధ్వానంగా మారిందని, ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది బాధ్యతారాహిత్యంగా పనిచేస్తున్నారన్నారు. పలుకాలనీల్లో నాలాపనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. బాలసరస్వతీనగర్‌లో నిర్వాసితులకు ఇప్పటి వరకు పరిహారం చెల్లించలేదని, టీడీఆర్ ఫైల్స్ కమిషనర్ వద్దే ఉన్నాయన్నారు. వర్షాకాలం ప్రారంభమైన ఇప్పటివరకు నాలాల డీసిల్టింగ్ పనులు పూర్తికాలేదన్నారు. ప్రజాసమస్యలపై కమిషనర్, మేయర్ దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు.

రూ.51 లక్షలతో అభివృద్ధి పనులు



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్ బీసీ ఏరియాలో రూ.51 లక్షలతో చేపట్టబోయే సీసీ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం నాచారం బాబానగర్‌లో రజక శ్మశానవాటికలో బర్నింగ్ ప్లాట్ ఫామ్, స్నానపుగదుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులను పూర్తిచేస్తున్నామని తెలిపారు. దశలవారీగా పనులను చేపడతామని పేర్కొన్నారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, బీఆర్ఎస్ నేత సాయిజెన్‌శేఖర్, మల్లాపూర్ వాసులు, నాచారం రజకసంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తరలింపు కేంద్రం పనులు నిలిపేయాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: చెత్త తరలింపు కేంద్రం నిర్మాణ పనులను నిలిపేయాలని మచ్చబొల్లారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ అధికారులను కోరారు. డివిజన్ పరిధిలోని సాయిరెడ్డికాలనీలో హిందూ శ్మశానవాటిక స్థలంలో జీహెచ్ఎంసీ చెత్త తరలింపు కేంద్రం నిర్మాణ పనులు చేపట్టడంపై నిరసన వ్యక్తం చేస్తూ.. స్థానిక కాలనీవాసులు జేఏసీగా ఏర్పడి నిరసన తెలుపుతున్నారు. వీరికి మద్దతుగా సోమవారం కార్పొరేటర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు నిర్మాణ పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. చెత్త తరలింపు కేంద్రం వల్ల స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, అధికారులు దీనిపై పునరాలోచించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి త్వరలో ఈ ప్రాంతాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడతారని తెలిపారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుని కాలనీవాసులకు న్యాయం చేయాలని కోరారు. డీసీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సాయిరెడ్డి కాలనీ అధ్యక్షుడు దిలీప్, లక్ష్మీఎన్‌క్లేవ్‌కాలనీ అధ్యక్షుడు రాజేష్, పలు కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు అశోక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మల్లిఖార్జున్, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలు



జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద సంతకాల సేకరణ

మల్కాజిగిరి: నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రైవేట్ స్కూల్స్‌పై తగిన చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం డిమాండ్ చేసింది. మల్కాజిగిరిలో జీహెచ్ఎంసీ వద్ద సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా వేదిక సంఘం నాయకులు మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ పాఠశాలలో పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయిస్తున్నారని, ప్రతి ఏటా ఫీజులు పెంచుకుంటూ పోతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈసారి నుంచైనా ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, తల్లుల సంఘం మండల కన్వీనర్ రాధ, లావణ్య, రమాదేవి, చంద్రశేఖర్, కరణం గోపి తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి !

రామంతాపూర్ : ఉప్పల్ వైపు వెళ్లే వరంగల్ జాతీయ రహదారి ఉప్పల్ పారిశ్రామికవాడ ప్రధాన ద్వారం ఎదుట గత 3 నెలలుగా భారీ ఎత్తున డ్రైనేజీ మురుగు పొంగిపొర్లుతుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ రోడ్డు నుంచి వెళ్లే వేలాది వాహనదారులు దుర్వాసన కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ డ్రైనేజీ లీకేజీకి సమీపంలోనే రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంతో పాటు ఎన్ఎస్ఎల్ ఐటీ పార్క్ వంటివి ఉన్నాయి. దీనిపై జలమండలి సీవరేజ్ బోర్డు అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని స్థానికులు వాపోతున్నారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా.. !



గత 3–4 నెలలుగా వరంగల్ వైపు వెళ్లే జాతీయ రహదారిపై భూగర్భ డ్రైనేజీ మురుగు పెద్దఎత్తున పొంగిపొర్లుతూ.. జలాశయంగా ఏర్పడి దుర్గంధాన్ని వెదజల్లుతున్న ఉప్పల్ సర్కిల్ జలమండలి అధికారుల నిర్లక్ష్య వైఖరితో పట్టించుకోకపోవడం దారుణం. వెంటనే యుద్ధ ప్రాతిపదికన పనులను ప్రారంభించి మురుగు ప్రవాహాన్ని అరికట్టాలి.

– ఎర్రం శ్రీనివాస్, ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు



భారీగా పొంగుతున్న డ్రైనేజీ మురుగు

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి



ఈశ్వరిపురి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

కాప్రా: ఈశ్వరిపురికాలనీలో అంతర్గత సీసీరోడ్లు నిర్మిస్తామని స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి తెలిపారు. కాలనీలో సమస్యలు తెలుసుకునేందుకు సోమవారం కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తన దృష్టికి తీసుకెళ్లడంతో నూతనరోడ్లు నిర్మించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈశ్వరపురి కాలనీలో రోడ్ల నిర్మాణానికి సత్వరమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. డిప్యూటీ ఇంజినీర్ బాలకృష్ణ, ఏఈ సూరజ్, కాలనీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సభ్యులు వేణుచారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.